తగ్గని వశిష్ట గోదావరి వరద ఉధృతి

నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరి ఉధృతి మంగళవారం కూడా తగ్గలేదు. ఎగు వ ప్రాంతం నుంచి భారీగా గోదావరిలోకి నీరు వచ్చి చేరుతుంది. అయితే వస్తున్న నీరు వస్తున్నట్టుగా సముద్రంలోకి వెళ్లతూ ఉండటంతో పెద్దగా ఇబ్బందిలేకుండా పోయింది. సముద్రం పోటు సమయంలో మాత్రం నీటిమట్టం పెరుగుతోంది. గోదా వరి ఉధృతి కారణంగా పట్టణంలోని మాధవాయి పాలెం రేవులో పంటు రాకపోకలు కొనసాగడం లేదు. ఏటిగట్టును ఆనుకుని ఉన్న పొన్నపల్లి, వాధ వాయిపాలెం ప్రాంతాల్లోని వారు ఆందోళన చెందుతున్నారు. స్లూయిజ్‌ల ద్వారా, డ్రెయిన్స్ ద్వారా గోదావరి నీరు స్వల్పంగా కాలనీల్లోకి చేరుతుంది. మరో రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది.

అప్రమత్తంగా ఉండాలి

నరసాపురం రూరల్: వరద కారణంగా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ బెజవాడ సీతారత్నం అన్నారు. మంగళవారం నరసాపురం మండలంలోని పాత, కొత్త నవరసపురం గ్రామాల్లో ముంపు బారిన ప్రాంతాల్లో తహసీల్దార్ పర్యటించారు. తీసుకోవాల్సిన సహాయక చర్యలను గురించి సిబ్బందికి సూచించారు. ఇప్పటికే కొత్తనవరసపురం ఎస్టీకాలనీలోని 79 కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పంపిణీ చేశారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ యశోద, వీఆర్వో కొప్పినీడి సత్తిబాబు పాల్గొన్నారు.



నరసాపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వశిష్ట గోదావరి



పెదమల్లంలో వరద మిగిల్చిన బురద

తగ్గుముఖం పట్టిన గోదావరి

పెనుగొండ: గోదావరి ఉధృతి మంగళవారం తగ్గుముఖం పట్టింది. లంక గ్రామాలను ముంచేత్తిన వరద నీరు నెమ్మదిగా తగ్గుతుంది. పల్లపు ప్రాంతాల్లో ఇంకా వరద నీరు నిలిచే ఉండడంతో రాకపోకలకు ఇబ్బందికరంగానే ఉంది. పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద వరద నీరు తగ్గడంతో బురద పేరుకుపోయింది. అయోధ్యలంక, మర్రిమూల, పెదమల్లం లంక, అణగారలంక, పుచ్చల్లంక, పెదపేట, నేతలవారి పేటల్లోని పల్లపు ప్రాంతాల్లో వరద నీరు అలాగే ఉంది. నీటి ఉధృతి తగ్గడంతో అధికారులు, లంకగ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకొంటున్నారు. పంట చేలన్నీ ఇంకా వరద నీటిలోనే ఉండడంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. కూరగాయల తోటలు కుళ్లిపోయి ఎందుకు పనికాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరద తగ్గిన ప్రాంతాల్లో రహదారుల్లో బురద పేరుకుపోవడంతో జారాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సిద్ధాంతం కేదారీఘాట్‌లోనూ నీటి మట్టం వేగంగా తగ్గుతుండడంతో మధ్యస్థలంకలోకి రైతులు రాకపోకలు సాగిస్తున్నారు. పాడి పశువులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పశుగ్రాస కొరతతో పాడిపశువులు అలమటిస్తున్నాయి. పూర్తి స్థాయిలో పశుగ్రాసం రైతులకు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వైద్య శాఖ ఆరోగ్య శిబిరాలను కొనసాగిస్తున్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: అంకితభావంతో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి తగిన గుర్తింపు గౌరవం ఎప్పుడూ ఉంటుందని నరసాపురం ఇన్‌చార్జి తహసీల్దార్ బెజవాడ సీతారత్నం అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల వరకూ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు వెళ్లిన ఎస్ఎస్ఎస్ ప్రసాద్ కు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాద్ స్వల్పకాలంలోనే అందరి మన్ననలూ పొందారని సీతారత్నం అన్నారు. డిప్యూటీ తహసీల్దార్‌లు కట్టానాగదేవి, జ్యోతి, ఆర్ఐ యశోధ, వీర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరి యాల లక్ష్మీనారాయణ, చౌకడిపో డీలర్ల సంఘం అధ్యక్షుడు ఏసు పాల్గొన్నారు.

ఐటీ రిటర్న్స్ దాఖలుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీ అధికారి మూర్తి

పాలకొల్లు సెంట్రల్: ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి బుధవారమే ఆఖరి రోజుని అందరూ సక్రమమైన ఆధారాలతోనే డిడక్షన్స్ క్లెయిమ్ చేయాలని ఐటీ శాఖ అధికారి ఆర్ఎస్ఆర్ మూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ఎంఎంకేఎస్ మునిసిపల్ హైస్కూల్‌లో ఆదాయపు పన్ను రిటర్న్ మరియు రిఫండ్ దాఖలుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ సరైన ఆధారాలు లేకుండా రిటర్న్స్ క్లెయిమ్ దాఖలు చేయవద్దని సూచించారు. సమావేశంలో ఐటీ ఇన్‌స్పెక్టర్ గిరీష, పాఠశాల హెచ్‌ఎం అడ్డాల నాని తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యునికి ప్రత్యేక పూజలు



కేపీ పాలెం నుంచి పాలకావిడిలు తీసుకువస్తున్న మాలధారులు

మొగల్తూరు: మండలంలోని రామన్నపాలెం పంచాయతీ అంబోతుతిప్ప ప్రాంతంలో వేంచేసియున్న శ్రీ వల్లీదేవ సేన సమేత సుబ్రహమణ్య స్వామి వారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం కృత్తికా నక్షత్రం సుబ్రహమణ్య స్వామి వారి జన్మనక్షత్రం కావడంతో స్వామి వారికి పాలకావిడి ఉత్సవం చేశారు. కేపీ పాలెం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుండి సుమారు 40 మంది మాలధారులు 40 కావిడిలతో అంబోతుతిప్పలోని సుబ్రమణ్య స్వామి వారి ఆలయం వరకు ఊరేగింపుగా తరలి వచ్చారు. సుమారు 80 బందెల పాలతోను, అభిషేక ద్రవ్యాలతో అర్చకులు రవితేజ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.

వార్డుల్లో కార్యక్రమాలకు కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వరా?

వైఎస్సార్ సీపీ సభ్యుల ఆగ్రహం





సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

నరసాపురం: ప్రభుత్వం మారితే కౌన్సిలర్ల విలువ తగ్గిపోతుందా? అని అధికార వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ సభ్యురాలు మల్లాడి శేషవేణి మాట్లాడుతూ తన వార్డుల్లో గోదావరి వరద కారణంగా పొన్నపల్లి ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు ఎదురయ్యాయని అన్నారు. అక్కడి కమిషనర్ వచ్చినప్పుడు తనకు కనీసం సమాచారం ఇవ్వలేదన్నారు. తన కు కూడా సమాచారం ఇవ్వకుండా వార్డులో పర్యటనకు వచ్చా రని కేసరి గంగరాజు ఆరోపించారు. పింఛన్ల పంపిణీలో కూడా తమను పిలవడలేదని 26వ వార్డు వైఎస్సార్‌సీపీ సభ్యుడు జిల్లెళ దిలీప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకపై అలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చైర్ పర్సన్ వెంకటరమణ కమిషనర్ వెంకటేశ్వరరావుకు సూచించారు. ప్రభుత్వం మారినంత మాత్రాన కౌన్సిలర్లుకు ఇచ్చే గౌరవం తగ్గించకూడదని బొంతు రాజశేఖర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మున్సిపల్ స్థలంలో దిమ్మలు కడుతున్నారు

26వ వార్డులో మున్సిపల్ స్థలంలో జనసేన జెండా దిమ్మ కడుతున్నారని, అనుమతి లేకుండా ఎలా కడతారని వార్డు కౌన్సిలర్ దిలీప్ ప్రశ్నించారు. దీనికి కమిషనర్ సమాధానం ఇస్తూ పనులు ఆపించామని చెప్పారు. ఇలాంటివి పట్టణంలో చాలా ఉన్నాయని, అన్నింటినీ తొలగించాలని వన్నెంరెడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. వైఎస్సా ర్‌సీపీ అధికారంలో ఉండగా చాలా ప్రాంతాల్లో జెండా దిమ్మలు కట్టారని వాటన్నింటీ తొలగించాలని టీడీపీ కౌన్సిరల్ పాలూరి బాబ్జి డిమాండ్ చేయడాన్ని వైఎస్సార్‌సీపీ సభ్యులు వైస్ చైర్మన్ కామన నాగిని, అడిదల శ్యామల, ద్వారా భవానీ తప్పుపట్టారు. సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు తరువాత నెలలో జరిగే సమావేశంలో సమాధానాలు చెప్పడం లే దని మరో వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బర్రి జయరాజు, కోటిపల్లి సురేష్, వైకేఎస్, కావలి రామసీత, సోమరాజు దుర్గాభవానీ, షేక్ యాకూబీబీ, పతివాడ పద్మ, సఖినేటిపల్లి సురేష్ పలు సమస్యలపై ప్రశ్నించారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ బుధవారం జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు న్నికల అధికారి నల్లిమిల్లి జోసఫ్ మంగళవారం విలేకరులకు చెప్పారు. ఇదిలా ఉంటే ఇప్పటికే 10 పదవులు ఏకగ్రీవమాయ్యాయి. మిగిలిన పదవులకు సంబంధించి అధ్యక్ష స్థానానికి చేగొండి బాబాజీ, గన్నాబత్తుల మత్స్యవల్లభరావు, ప్రధాన కార్యదర్శి పదవికి రొక్కాల గ్లాడ్‌స్టన్‌కుమార్, రంపా పుల్లాజీ, గ్రంథాలయ కార్యదర్శి పదవికి నారిన శ్రీనివాసరావు, కె.అమరేశ్వరరావు, క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి పదవికి మేడిది శ్రీమంతి, కొప్పినీడి చిట్టి పద్మజ, మహిళా ప్రతినిధి పదవికి బొడ్డు ప్రగతి, రొక్కాల జెస్సీకళ పోటీపడుతున్నారు. ఈ పదవులకు గానూ ఉదయం 10 గంటలు నుంచి మధ్యానం 4.30 గంటలు వరకూ పోలింగ్, తరువాత ఓట్లలెక్కింపు జరగనుందని జోసఫ్ వెల్లడించారు.



చట్టాలపై అవగాహన అవసరం



ఆగర్రు ఎంపీయూపీ స్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: కిశోర బాలికలు మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్. మంగ కోరారు. పాలకొల్లు మండలం ఆగర్రు ఎంపీయూపీ స్కూల్‌లో మిషన్ శక్తి 100 కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలతో మిషన్ శక్తి 100 ఆకృతిలో అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం జి గిరిబాబు, ఏఎన్ఎం ఎం మేరీ, మహిళా పోలీస్ షేక్ మీరా హుస్సీసా పాల్గొన్నారు. అలీఆగే యాళ్లవానిగరువు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లేశ్వరి పాల్గొని మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ రాజకుమారి, అంగన్‌వాడీ టీచర్లు వి పద్మ, పి.స్వరూప పాల్గొన్నారు.

యలమంచిలిలో...

యలమంచిలి: సమాజంలో మహిళలపై ఉన్న వివక్షతను పారద్రోలి లింగ సమానత్వాన్ని తీసుకురావడమే బేటీ బచావో-బేటీ పఢావో, మహిళ శక్తి కార్యక్రమం ప్రధాన ధ్యేయమని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర అన్నారు. మేడపాడు గ్రామంలో మంగళవారం ఆమె బేటీ బచావో-బేటీ పఢావో మహిళ శక్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా సాధికారిత, మహిళల భద్రత మహిళలను ప్రభావితం చేసే సమస్యలను వివరించారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: ద్విచక్ర వాహనాలు నడిపే విద్యార్థులతో సహ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజ రాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

కంప్యూటర్ అందజేత

పెనుగొండ: ఇలపర్రులోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ జాగర్లమూడి శ్రీదేవి పాఠశాలకు రూ.40 వేలు విలువైన కంప్యూటర్‌ను బహుకరించారు. మంగళవారం కంప్యూటర్‌ను కలగల వెంకట సత్యసాయి బాబు, శ్రీదేవి దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దొమ్మేటి రాంబాబు పాల్గొన్నారు.

మాజీ వలంటీర్ సహాయంతో వరద బాధితులకు ఆహారం పంపిణీ



ఏనుగువానిలంకలో వరద బాధితులకు ఆహారం వడ్డిస్తున్న మాజీ వలంటీర్ పాలపర్తి సందీప్

యలమంచిలి: ఏనుగువానిలంకలో మాజీ వలంటీర్ పాలపర్తి సందీప్ వరద బాధితులకు ఆహారం అందేలా చర్యలు తీసుకుంటూ తనలోని సేవా నిరతిని చాటుకుంటున్నాడు. కాజ డ్రెయిన్ పొంగడంతో ఏనుగువానిలంక గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ వరదనీటితో మునిగింది. ఇళ్లలోకి సైతం వరద నీరు వెళ్లడంతో వంట చేసుకునే పరిస్థితి లేదు. సుమారు 45 కుటుంబాలు ఈ విధంగా ఇబ్బంది పడుతున్నాయి. వారి ఇబ్బందిని గమనించిన మాజీ వలంటీర్ పాలపర్తి సందీప్ దాతలను ఆశ్రయించి, వారి సహకారంతో వరద బాధితులకు ఆహారం ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధంగా సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ పాతూరి బుచ్చిరాజు మంగళవారం ఉదయం పాలపర్తి మహేంద్ర (డేవిడ్) సాయంత్రం నేతల ఇమ్మానుయేలు సహకారంతో వరద బాధితులకు ఆహారం అందించాడు. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోయిన జగనన్న ప్రతినిధిగా వలంటీర్ తనలోని సేవా గుణంతో ఆహారం అందించడంపై వరద బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రక్తదానంతో ప్రాణదానం

పాలకొల్లు అర్బన్: రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలను కాపాడినవారవుతారని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఉల్లంపర్రు డా. సబితా మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 16 మంది పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రోటరీక్లబ్ సభ్యులు మద్దుల శశి కిరణ్‌గుప్త 54వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. అలాగే రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, క్లబ్ సభ్యులు జవ్వాజి కల్యాణ్, బొల్లా శ్రీనివాస్ రక్తదానం చేశారు.

మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: మెరిట్ విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు దాతల సహకారం కూడా అందించాల్సిన అవసరం ఉందని హెచ్‌ఎం షేక్ పీర్‌సాహెబ్ అన్నారు. మండలంలోని దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి ఇంటర్మీడియట్‌లో 970 మార్కులు పొందిన నిల్లా రేవతి, 940 మార్కులు సాధించిన బొప్పె నాగదేవిలకు హైదరాబాద్‌లో ఉంటున్న ఇదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి అందించిన రూ.16వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం పీర్‌సాహెబ్ అందజేసి బాగా చదువుకోవాలని విద్యార్థినులను ప్రోత్సహించారు.

వరద బాధితులకు పరామర్శ

యలమంచిలి: గోదావరి, కృష్ణా నదులకు వచ్చిన వరదల వలన రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులన్నీ నిండుతున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. బాడవ గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. వారికి నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయి వెంకట దుర్గ, ఎంపీటీసీ సభ్యుడు ఇంటి బాబూరావు, పాతూరి రామరాజు తదితరులు ఉన్నారు.

బీజేపీ అధ్యక్షుడి పర్యటన..

భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షు డు నార్ని తాతాజీ మంగళవారం యలమంచిలి మండలంలో పర్యటించారు. గోదావరి వరదలు, నక్కల, వల్లూరు డ్రయిన్ పొంగడం వలన ముంపునకు గురయిన గ్రామాలను, వరి చేలను, ఆక్వా చెరువులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట దొంహ నరసింహకుమార్, నామన శ్రీనివాస్, ఉన్నమట్ల కబర్ధి ఉన్నారు.

ఇంటి వద్దే పింఛన్లు అందజేస్తాం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని పింఛన్ లబ్ధిదారులు ఎవ్వరూ సచివాలయాల వద్దకు గానీ, మునిసిపల్ కార్యాలయాల వద్దకు గానీ రావద్దని ప్రతి లబ్ధిదారుడికి ఇంటికి వచ్చే పింఛన్లు అందజేస్తామని మునిసిపల్ కమిషనర్ విజయసారథి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఓ ప్రకటన విడుదల చేశారు.